రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

శేరిలింగంపల్లి: ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రాజకీయ పార్టీలు బీఎల్‌ఏలను ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలు, బస్తీల్లో మరణించిన ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల నాయకులు అందిస్తే వాటిని విచారణ చేసి తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రేమ్‌కుమార్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 45, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20.

నెలాఖరుకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



చందానగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అంబేద్కర్ కల్యాణ మండపంలో సర్వేయర్లు, సూపర్ వైజర్లు, నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో సుమారు 24వేలు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, బ్యాంకు అధికారులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐడీబీఐ బ్యాంక్ వారి సౌజన్యంతో బుధవారం కుర్చీలు, కంప్యూటర్ టేబుల్స్, స్పీకర్ సెట్, అల్మారాలు, పుస్తకాలు. వంట సామగ్రి పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆర్‌హెచ్ సందీప్ పట్నాయక్, కూకట్‌పల్లి డీజీఎం మురళీధర్‌లతో కలిసి డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు సామానులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఐడీబీఐ బ్యాంక్ ఉన్నతాధికారులు, సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి, బోధనా సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి: అయోధ్య రామమందిరం మొదటి వార్షికోత్సవంను పురస్కరించుకొని బుధవారం బాలాజీనగర్‌లోని శ్రీ సంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సీతారామచంద్రస్వామికి ఉదయం అభిషేకం, లక్ష పుష్పార్చన, సాయంత్రం దీపోత్సవం జరిగింది.

డ్రంకెన్ డ్రైవ్.. జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రూ. 1500 జరిమాన, ఒకరికి రూ. 2 వేలు జరిమాన, మరొకరికి రూ.వెయ్యి జరిమానా, అదేవిధంగా మరో వ్యక్తికి జరిమానా, 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గచ్చిబౌలి: చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్కూటీ పంక్చర్ కావడంతో కింద పడి గాయపడ్డ బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నార్సింగిలో నివాసముండే సునీత తన మరదలు నందు(17) కలిసి స్కూటీపై ఈనెల 4వ తేదీన సాయంత్రం గచ్చిబౌలి నుంచి నార్సింగికి బయలుదేరింది. గచ్చిబౌలి జంక్షన్ సమీపంలో స్కూటీ టైర్ పంక్చర్ కావడంతో ఇద్దరు కిందపడ్డారు. తలకు దెబ్బ తగిలిన నందు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హఫీజ్‌పేట్ స్టేషన్‌కు

'అమృత్ హంగులు'

రూ. 26.6 కోట్లతో ఆధునికీకరణ పనులు

రూపురేఖలు మారనున్న హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్

చందానగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అధునాతన సౌకర్యాల కల్పన జరగనుంది. ఈ పథకంతో దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించే క్రమంలో హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు.

- రూ.26.6 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి.
- ప్రయాణికులకు పలు సౌకర్యాలతో పాటు హోటల్స్, మాల్స్‌తో కూడిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.
- స్టేషన్‌లో మెరుగైన లైటింగ్ వ్యవస్థ, ఎస్కలేటర్లు, రైల్ ఓవర్ బ్రిడ్జి, దివ్యాంగులకు కనీస వసతులు, ఉచితంగా వైఫై అందించనున్నారు.
- గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు.
- రైల్వే స్టేషన్‌ను సిటీ సెంట్రల్‌గా అభివృద్ధి చేస్తూ అబ్బురపరిచే రీతిలో రైల్వే భవనం, ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్ మోడల్ ఇంటిగ్రేషన్, ప్రయాణికులకు మార్గనిర్దేశం కొరకు సంకేతాలు, ల్యాండ్ స్కేపింగ్, కళ, సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.
- ప్రయాణికులకు ఎల్‌ఈడీ ఆధారిత సూచిక బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు.
- సాంకేతికంగా అభివృద్ధి చేయబడిన ప్రజా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.



పూర్తి కావొస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ నమూనా చిత్రం

అభివృద్ధి అవసరం



అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద పనులు జోరుగా సాగుతున్నాయి. హఫీజ్‌పేట్ చుట్టుపక్కల ప్రజలకు ప్రయాణానికి సులువుగా ఉంటుంది. స్టేషన్ అభివృద్ధి చాలా అవసరం.

–అశోక్, మదీనాగూడ

రాకపోకలు పెరుగుతాయి



హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ అభివృద్ధితో స్థానిక, దూరప్రాంత ప్రయాణికుల రాకపోకలు పెరుగుతాయి. ఇప్పటికే వారాంతపు రోజులలో స్టేషన్ కిక్కిరిసిపోతుంది. ఇప్పుడు రైల్వే స్టేషన్ అభివృద్ధితో సౌకర్యం కలుగుతుంది.

–అంజి, హఫీజ్‌పేట్



దాదాపు పూర్తి అయిన వెయిటింగ్ హాల్

జీవ వైవిధ్య లక్ష్యాల కోసం పని చేయాలి

చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ జి.రామలింగం



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీసీఎఫ్ జి.రామలింగం

గచ్చిబౌలి: జీవ వైవిధ్య లక్ష్యాలను చేరుకునేందుకు యువ ఫారెస్ట్ ఆఫీసర్లు పని చేయాలని తెలంగాణ చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) రామలింగం పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో అటవీ జీవ వైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బీ) ఆధ్వర్యంలో ఐఎఫ్ఎస్ ఆఫీసర్లకు 'ప్రపంచ జీవ వైవిధ్య చట్టం, లక్ష్య సాధన ప్రక్రియ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, స్థానిక అధికారులు, ప్రజల సహకారంతో జీవవైవిధ్య నష్టాలను ఆపాలని సూచించారు. భారతదేశ జీవ వైవిధ్య వ్యూహం, కార్యాచరణపై చర్చించారు. శిక్షణ కార్యక్రమంలో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వర్క్ షాపులో చర్చించిన ప్రధానాంశాలతో కూడిన నివేదికను వాతావరణ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

గచ్చిబౌలి: హనుమాన్‌నగర్ కాలనీలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. మాదాపూర్‌లోని హనుమాన్‌నగర్‌కాలనీలో ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తామన్నారు. మ్యాన్‌హోల్స్ నుంచి పూడిక తీసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నిత్యం డ్రైనేజీ సమస్య తలెత్తుతోందని, రోడ్లు, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, డ్రైనేజీ ఔట్‌లెట్ల సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, టౌన్‌ప్లానింగ్ విభాగం, జలమండలి విభాగం అధికారులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలి

కేంద్ర మంత్రికి ఏబీవీపీ జాతీయ నాయకుల వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ జాతీయ నాయకులు

రాయదుర్గం: గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఏబీవీపీ జాతీయ నాయకులు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జువల్ ఓరమ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. బుధవారం హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్.బి.రాజ్ వివరాలు తెలిపారు.ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరేంద్ర సింగ్ నా యకత్వంలో న్యూఢిల్లీలో మంత్రిని కలిశామని తెలిపారు. ఒకేషనల్, సాంకేతిక కోర్సులు, శిక్షణ, వ్యవసాయ సంబంధిత కోర్సులను అందుబాటులోకి తెచ్చేలా చూడాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీ, శాశ్వత భవనాల నిర్మాణం, క్రీడా సదు పాయాలు మెరుగుపరచాలని తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూబ్లీ గార్డెన్ రోడ్డు నంబర్ 6,7,అపర్ణ, వాసవి కన్‌స్ట్రక్షన్స్, రవి ఎన్‌క్లేవ్, మీనాక్షీ టవర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

- ఏపీహెచ్‌బీ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు.
- ట్రిపుల్‌ఐటీ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీకాలనీ 4వ ఫేజ్, ఓల్డ్ గచ్చిబౌలి, స్ట్రీట్ నంబర్–3 ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సురక్షా ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. ఉ.11.30 గంటల నుంచి మ.1.00 గంట వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్‌తో పాటు మార్కెట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3.30 గంటల వరకు శిల్పా గార్డెన్స్, వెంకటేశ్వర లేఅవుట్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, నార్నె ఎస్టేట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లింగమూర్తి, రాజు, స్వామి నాయుడు తదితరులున్నారు.

రైతు భరోసాపై నిలదీత

పటాన్‌చెరు టౌన్: రైతు భరోసాపై పాశమైలారం గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. బుధవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం, క్యాసారం, పెద్దకంజర్ల, ఇంద్రేశం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాశమైలారం గ్రామసభలో ప్రజలు రైతుభరోసాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రైతు భరోసా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా పెద్ద కంజర్ల గ్రామంలో గతంలో హెచ్ఎండీఏకు ఇచ్చిన భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వలేదని అలాగే ఇచ్చిన భూముల్లో రైతులకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ రాతపూర్వకంగా రాసి ఇస్తే ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. క్యాసారం, ఇంద్రేశం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రజలు అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి హరిశంకర్‌గౌడ్, తహసీల్దార్ రంగారావు, ఏఓ శివకుమార్, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: డ్రైనేజీ పైపులైన్ పనులను అడ్డుకోవద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. గోపాల్‌నగర్ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు వేయనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను గోపాల్‌నగర్ కాలనీ వద్ద కొంతమంది ప్లాట్ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్‌నగర్ లేఅవుట్ నుంచి వెళుతున్న రోడ్డు వాటర్‌వర్క్స్‌కు సంబంధించినదని, జీహెచ్‌యంసీలో 200 ఫీట్లుగా మాస్టర్ ప్లాన్‌లో గుర్తించారు. ఈ పనులను వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. పనులకు అంతరాయం కలుగజేస్తే వారి డాక్యుమెంట్‌లు, టౌన్ ప్లానింగ్ డాక్యుమెంట్‌లు పరిశీలించి కూకట్‌పల్లి, మియాపూర్ తహసీల్దార్‌లను సంప్రదించి మార్కింగ్ చేయాలని అధికారులకు సూచించారు. పైపులైన్ నిర్మాణ పనులు ఆపినట్లయితే మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ డ్రైనేజీ పైపులైన్ పూర్తయితే గోపాల్‌నగర్ కాలనీవాసులకు ఎంతో ఉపయోగపడుతుందని, అధికారులకు సహకరించాలని గోపాల్‌నగర్‌వాసులను ఎమ్మెల్యే కోరారు. తహసీల్దార్ స్వామి, వాటర్ వర్క్స్ జీఎం. ప్రభాకర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్, డీఈ శంకర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై మరింత అవగాహన కల్పించాలి



కొత్తగూడలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ కొత్తగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆర్టీఏ విభాగం అధికారుల ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం–2025లో భాగంగా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. విద్యార్థి దశలోనే బోధిస్తే భవిష్యత్తులో తప్పనిసరిగా నియమాలు పాటిస్తారన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.మద్యంతాగి వాహనాలు నడిపి మీ కుటుంబానికి నష్టం కలిగించవద్దన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆర్‌టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎంఈఓ వెంకటయ్య, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, పాల్గొన్నారు.

హోరాహోరీగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్



గచ్చిబౌలి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ హోరాహోరీగా సాగుతోంది. గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ క్లబ్ వేదికగా జరిగిన రెండో రౌండ్ పోటీల్లో ఎంవైకే స్ట్రైకర్స్ జట్టు ఆధిక్యంలో నిలిచింది. ఆ టీమ్ గోల్ఫర్లు అద్భుతంగా రాణించడంతో 199 పాయింట్లు స్కోర్ చేసి రెండో రౌండ్‌లో అగ్రస్థానంలో సాధించింది. ఎంవైక్ స్ట్రైకర్స్ గోల్ఫర్ సునీల్ గోదావర్తి 37 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. ఇక ఓవరాల్ పాయింట్ల పట్టికలో ఎగైల్ దర్బీ డజన్ టీమ్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. రెండో రౌండ్‌లో 182 పాయింట్లు సాధించి ఓవరాల్ గా టాప్ ప్లేస్ లో కొనసాగుతోంది. స్వింతోకెమ్ స్వింగ్ కింగ్స్ జట్టు 378 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. ఎంవైకే స్ట్రైకర్స్ 365, మీనాక్షి మావెరిక్స్ 362 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. కాగా ట్యూటోరిట్ టీమ్ గోల్ఫర్ తనూజ్ వొహ్రా రెండో రౌండ్ లో 38 పాయింట్లు స్కోర్ చేసి టాప్ ప్లేస్ లో నిలిచాడు. మొత్తం 12 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్ ఫైనల్స్ వియాత్నంలో జరగనున్నాయి.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

మాదాపూర్: ప్రమాదవశాత్తు భవనం 17వ అంతస్తు పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాకేశ్ అలామ్(23) అనే వ్యక్తి సెంట్రింగ్ పనిచేస్తూ అంజయ్యనగర్‌లో నివాసముంటున్నాడు. వాసవి స్కైలా కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పనిచేస్తున్న అతను బుధవారం ప్రమాదవశాత్తు 17వ అంతస్తు నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి శాతవాహననగర్ కాలనీ అసోసియేషన్ నూతన సంవత్సరం– 2025 కేలండర్‌ను బుధవారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రత్న ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బాబూరావు, సెక్రటరీ యాదిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామనాథం, రామ్‌కోటేశ్వరరావు, హనుమంతరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

నవజాత శిశువు ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు



మాదాపూర్: నవజాత శిశువు(36వారాల)కు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడారు మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ వైద్యులు. బుధవారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్లు మధుసూదన్ రెడ్డి, రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ మిడ్‌గట్ వాల్యూస్ విత్ స్మాల్ రొటేటింగ్ డిసీజ్ అనేది ప్రాణాంతక పరిస్థితి అని దీనికి సకాలంలో చికిత్స అవసరమన్నారు. ఇది పుట్టుకతో వస్తుందని శిశువు చిన్న, పెద్ద పేగులను పొత్తికడుపు లోపల ఉంచడాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. శస్త్ర చికిత్సద్వారా శిశువును కాపాడామన్నారు.సెంటర్ హెడ్ సాయిప్రసాద్, డా.నవిత, డా.వంశీరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువు వద్ద కాలనీవాసుల నిరసన

'సేవ్ మస్కిటో, సేవ్ లేక్ డ్రైనేజీ స్మెల్, సేవ్ ట్రాఫిక్ జామ్స్' నిరసన ర్యాలీ



ఎల్లమ్మ చెరువు వద్ద నిరసన తెలిపిన ఆయా కాలనీలవాసులు

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంత కాలనీల జేఏసీ సభ్యులు ఆరోపించారు. బుధవారం కూకట్‌పల్లి, ఎల్లమ్మ బండ, ఎల్లమ్మ గుడి దగ్గర నుంచి ఎల్లమ్మ చెరువు వరకు ముక్కు మూసుకుని 'సేవ్ మస్కిటో, సేవ్ లేక్ డ్రైనేజీ స్మెల్, సేవ్ ట్రాఫిక్ జామ్స్' అంటూ ప్లకార్డ్స్ పట్టుకొని ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. భవ్యాస్ తులసివనం, నవోదయ కాలనీ, విజయనగర్ కాలనీ, శుభోదయ కాలనీ, హెచ్ఎంటి శాతవాహన నగర్, జయనగర్ కాలనీ, రామ్‌కి, శిల్పా బృందావనం, తదితర కాలనీలవాసులు జేఏసీగా ఏర్పడి భారీగా తరలివచ్చి ఎల్లమ్మ చెరువు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దుర్వాసన, దోమల బెడదతో భాగ్యనగర్ కాలనీ నుంచి ఉషా ముళ్ళపూడికి వెళ్లే ఈ రహదారి ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నామని, అనేకమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో దోమల ప్రబలి కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. సంవత్సరాల తరబడి సమస్యతో బాధపడుతున్నామని, పరిష్కరించటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో పలు కాలనీల అసోసియేషన్‌ల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



దుర్గంధం, ట్రాఫిక్ సమస్య గురించి వివరిస్తున్న జేఏసీ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462